


మానుకోటలో ఏర్పాటు చేసిన రాఖీ దుకాణంలో రాఖీలు, స్వీట్ షాపులో స్వీట్లు కొనుగోలు చేస్తున్న మహిళలు

అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్



నేడు రాఖీ పండుగ..

- పుట్టింటికి చేరుకుంటున్న ఆడపడుచులు
- మార్కెట్లో రూ. 10 నుంచి రూ.300 వరకు రాఖీ ధరలు
- చిన్నారుల కోసం కార్టున్‌లతో తయారీ

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఆగస్టు 18 : అన్నాచెల్లెల ఆత్మీయ అనుబంధానికి ప్రతీక రాఖీ పర్వదినం. ఈ పండుగపై నాటి నుంచి నేటి వరకు అనేక పురాణాలు, కథలు ప్రచారంలో ఉన్నాయి. సోదరుడికి కట్టే రాఖీలు సోదరీమణులకు ఎంతో రక్షణ కవచంగా నిలుస్తాయని విశ్వాసం. మార్కెట్‌లో రుద్రాక్ష, స్టోన్, వెండి, బంగారు రాఖీలు ప్రత్యేకంగా నిలిచాయి. కుందన్‌లు మెరుపులు జరీతో పాటు స్పాంజితో తయారు చేసినవి మార్కెట్‌లోకి వచ్చాయి. పిల్లలను ఆకర్షించేందుకు కార్టున్ రాఖీలు కూడా వచ్చాయి. పాతకాలంలో అతి పెద్దగా ఉండే రాఖీలు ధరించేవారు. రానురాను అవి చిన్నగా మారి పోయాయి. మళ్లీ ఈ సంవత్సరం మార్కెట్‌లోకి పెద్దపెద్ద రాఖీలు దుకాణాల్లో దర్శనమిచ్చాయి. దూరప్రాంతాల్లో ఉన్న సోదరులకు సోదరీమణులు కొరియర్, పోస్ట్ ద్వారా ముందుగానే రాఖీలు పంపించారు. కాగా, రూ.10 నుంచి మొదలుకుని రూ. 300 వరకు రాఖీ ధరలు పలుకుతున్నాయి.

మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా ఆడపడుచులు ఈ ఏడాది రాఖీ పర్వదినాన్ని సుఖఃసంతోషాలతో జరుపుకునేందుకు సిద్ధమయ్యారు. ఆదివారం నాటికే నాటికే పుట్టింటికి చేరుకునేందుకు తరలివస్తున్నారు. రాఖీ పర్వదినాన్ని రాఖీ పౌర్ణమి, శ్రావణపౌర్ణమి, జంజాల పౌర్ణమి కూడా అంటారు. సోమవారం (నేడు) పౌర్ణమి తిథి కాబట్టి ఈరోజే రాఖీ పౌర్ణమి జరుపుకోవాలని వేద పండితులు, అర్చకులు చెబుతున్నారు. సోమవారం రాఖీ పర్వదినాన్ని జరుపుకోవచ్చనే పండితుల సూచనల మేరకు ఆడపడుచులు రాఖీలు, స్వీట్లతో పుట్టింటికి చేరుకుంటున్నారు. పంచాంగం ప్రకారం ఈనెల 19న ఉదయం 5.53 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 1.32 గంటల వరకు భద్ర కాలం ఉంటుందని ఆ సమయంలో రాఖీలు కట్టుకోవడం శుభప్రదం కాదని, మధ్యాహ్నం 1:46 గంటల నుంచి రాత్రి 10 గంటల్లోపు రాఖీ పండుగను జరుపుకోవచ్చని వేద పండితులు చెబుతున్నారు. ఆ సమయంలో సోదరీమణులు తమ సోదరులకు రాఖీలు కట్టవచ్చని పండితులు తెలిపారు.

హిందూ పండుగల్లో ఒకటి..

హిందువులు జరుపుకునే పండుగల్లో రాఖీ ఒకటి. ఈ పండుగ సోదర, సోదరీమణులకు మధ్య ప్రేమకు గుర్తుగా పేరుగాంచింది. రాఖీ కట్టిన తన సోదరికి సోదరుడు తన జీవితాంతం అండగా ఉంటానని మాట ఇస్తాడు. ఈ రోజున సోదరీమణులు తమ సోదరుడి మణికట్టుపై రాఖీకట్టి స్వీటు తినిపించి హారతినిస్తారు. తనకు రాఖీ కట్టిన సోదరికి ఏదైనా చిరుకానుక బహుమతిగా ఇచ్చి జీవితాంతం కాపాడతానని హామీ ఇచ్చినట్లుగా భావిస్తారు. ఈ పండుగ ప్రతీ సంవత్సరం శ్రావణమాసం పౌర్ణమి రోజున జరుపుకుంటారు. రక్షాబంధన్ అనే పదం రక్ష, బంధన్ అనే రెండు పదాలతో ఏర్పడింది. దేవతామూర్తుల కాలం నుంచి ఈ పండుగను జరుపుకుంటున్నట్లుగా చరిత్ర ద్వారా తెలుస్తోంది.



ములుగులో మంత్రి సీతక్కతో రాఖీ కట్టించుకుంటున్న కొత్తపల్లికి చెందిన కట్రోజు భిక్షపతి

పండుగను ఎందుకు జరుపుకుంటారంటే...

ఒకరోజు శ్రీగణేశుడు తన సోదరి మానసదేవితో రాఖీ కట్టించుకుంటుండగా.. అప్పుడు ఇద్దరు కుమారులు శుభ్, లాభ్‌లు ఇది ఏంటని అడిగారట. అప్పుడు గణేశుడు ఇది రక్షణ కవచం అని, ఈ రక్షాసూత్రం సోదర సోదరీమణుల మధ్య ప్రేమకు ప్రతీక అని చెప్పాడట. ఇది విన్న శుభ్, లాభ్‌లు తమకి కూడా ఒక సోదరి కావాలని పట్టుబట్టగా తన కుమారుల కోరిక మేరకు గణేశుడు తన శక్తుల నుంచి ఒక మంటను సృష్టించి దానిని తన భార్యలు సిద్ధి, బుద్ధిల ఇద్దరి ఆత్మశక్తితో కలిపి ఆ వెలుగు నుంచి ఒక అమ్మాయి జన్మించింది. ఆ అమ్మాయికే సంతోషిమాత అని పేరు పెట్టారట!



ఆలయాల్లో ప్రత్యేక పూజలు..

జిల్లా వ్యాప్తంగా ఉన్న దేవాలయాల్లో రాఖీ పర్వదినం రోజున భక్తులతో కిటకిటలాడనున్నాయి. రాఖీ పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తులు ఉదయాన్నే తలంటు స్నానాలు ఆచరించి దేవాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేసి సోదరులకు రాఖీలు కట్టనున్నారు. దీంతో జిల్లా కేంద్రం, మండల కేంద్రాలతో పాటు గ్రామాల్లో ఉన్న ఆలయాల్లో కూడా పర్వదినం సందర్భంగా భక్తుల సౌకర్యార్థం అర్చకులు, ఆలయ కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. రాఖీ పర్వదినం సందర్భంగా ఆలయాలు భక్తులతో సందడిగా మారనున్నాయి.



మానుకోటలోని బ్రహ్మకుమారి సంస్థలో ఆర్టీసీ సిబ్బందికి రాఖీకట్టి, శుభాకాంక్షలు తెలుపుతున్న సంస్థ ఇన్‌చార్జి రాజయోగిని

ఆప్యాయతలకు ప్రతీక రాఖీ

అన్నదమ్ముల అనురాగ, ఆప్యాయతలకు ప్రతీక రాఖీ పర్వదినం అని బ్రహ్మకుమారి ఈశ్వరీయ విద్యాలయ సంస్థ ఇన్‌చార్జి రాజయోగి అన్నారు. మహబూబాబాద్‌లోని బ్రహ్మకుమారి సంస్థలో ఈనెల 19న రాఖీ పర్వదినాన్ని పురస్కరించుకొని సంస్థ సభ్యులకు ఆదివారం రాఖీలు కట్టి స్వీట్లు తినిపించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచ శాంతి సౌభ్రాతృత్వమే మూలమని, రక్షాబంధనం యొక్క పవిత్ర భావన మానవునిలో నిత్యం ఉండాలని సూచించారు. ఈ వేడుకలో మానుకోట పట్టణ సీఐ దేవేందర్, ఎస్సై దీపికారెడ్డి, వైద్యులు భీంసాగర్, చంద్రశేఖర్, రంజిత్‌రెడ్డి, విద్యుత్‌శాఖ అధికారులు రమేష్, గోపి, రమణ, సురేష్‌కుమార్, ప్రభాకర్, పర్వీన్, బ్యాంకు మేనేజర్ నిమ్మ శ్రీనివాస్, ఆర్టీసీ సిబ్బంది గురుమూర్తి, సారయ్య పాల్గొన్నారు.



ఈవో భిక్షమాచారిని విచారిస్తున్న ఏసీబీ ఇన్‌స్పెక్టర్లు

ఏసీబీ వలలో 'శ్రీముసలమ్మ' ఈవో

- దుకాణదారుడి నుంచి రూ.20 వేలు లంచం డిమాండ్
- డబ్బులు తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు
- మరిపెడలోని ఇంట్లోనూ తనిఖీలు



పట్టించిన నల్లెపు సాంబయ్య

కొత్తగూడ (మహబూబాబాద్ జిల్లా), ఆగస్టు 18: మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం గుంజేడు గ్రామంలోని శ్రీముసలమ్మ ఆలయ ఈవో భోగోజు భిక్షమాచారి ఆదివారం ఏసీబీ వలలో చిక్కుకున్నారు. ఓ దుకాణ టెండరుదారుడి నుంచి రూ.20వేలు లంచం తీసుకుంటుండగా అవినీతి నిరోధక శాఖ అధికారులు పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపిన వివరాల ప్రకారం.. గుం జేడు శ్రీముసలమ్మ ఆలయం ఆవరణలో దేవాదాయశాఖ ఆధ్వర్యంలో కిరాణ షాపు ఏర్పాటు చేశారు. గత మే 29న టెండరులో గుంజేడుకు చెందిన పాల్తి రాములు అనేవ్యక్తి ఈ దుకాణాన్ని దక్కించుకున్నాడు. అయితే హైదరాబాద్‌కు చెందిన నల్లెపు సాంబయ్య ఈషాపును నడిపిస్తున్నాడు. ఈ దుకాణంలో మద్యం అమ్ముతున్నారని గత జూన్ 11న షాపును దేవాదాయ శాఖ సీజ్ చేసింది. ఈ క్రమంలో దుకాణాన్ని మళ్లీ తెరుచుకోవడానికి సాంబయ్య దేవాదాయశాఖ ఉన్నతాధికారి నుంచి అనుమతి తీసుకువచ్చాడు. అయితే షాపు పునరుద్ధరణకు లంచం ఇవ్వాలని ఈవో భిక్షమాచారి నెల రోజులుగా డిమాం డ్ చేస్తున్నాడు. లేకుంటే మళ్లీ షాపును సీజ్ చేయిస్తానని ఇబ్బందులకు గురిచేశాడు. దీంతో ఈ విషయంపై సాంబయ్య ఏసీబీ అధికారులను సంప్రదించాడు. దీంతో ఆదివారం మధ్యాహ్నం గుంజేడుకు వచ్చిన అధికారులు.. సాంబయ్యకు రూ.20వేలు ఇచ్చి ఈవో భిక్షమాచారి ఇప్పించారు. ఈవో రూ.20వేలు తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నగదు స్వాధీనం చేసుకుని కెమికల్ పరీక్షలు నిర్వహించి నిర్ధారణ చేసుకున్నారు. విచారణ చేపట్టిన అనంతరం భిక్షమాచారిని కస్టడీలోకి తీసుకున్నారు. ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామని డీఎస్పీ సాంబయ్య తెలిపారు. ఈ దాడుల్లో ఇన్‌స్పెక్టర్‌లు శ్యాంసుందర్, రాజు పాల్గొన్నారు.

మరిపెడలోని ఈవో ఇంట్లో తనిఖీలు

మరిపెడ: మరిపెడలోని గుంజేడు ముసలమ్మ ఆలయ ఈవో ఇంట్లో ఆదివారం రాత్రి వరకు ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. కొత్తగూడ మండలంలోని గుంజేడు ముసలమ్మ ఆలయ ఈవోగా పనిచేస్తున్న భిక్షమాచారి ఏసీబీ అధికారులకు చిక్కారు. ఈ నేపథ్యంలో ఏసీబీ అధికారులు ఏకకాలంలో ఈవో ఇంట్లో సైతం తనిఖీలు చేశారు. ఏసీబీ ఇన్‌స్పెక్టర్ ఎస్.రాజు తెలిపిన వివరాల ప్రకారం.. మరిపెడలోని ఈవో ఇంట్లో రూ.70వేలు నగదు, 270 గ్రాముల వెండి, 4 గ్రాముల బంగారు ఆభరణాలు లభించినట్లు చెప్పారు. ఈ దాడుల్లో ఆయన వెంట ఏసీబీ సిబ్బంది, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.



మరిపెడలోని గుంజేడు ముసలమ్మ ఆలయ ఈవో ఇంట్లో సోదా జరుపుతున్న ఏసీబీ అధికారులు

గిరిజనులకు 12 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి

- 9న జరిగే సంహగర్జనను విజయవంతం చేయాలి
- సేవాలాల్ సేన వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు సంజీవనాయక్



సదస్సులో మాట్లాడుతున్న భూక్యా సంజీవనాయక్

నెహ్రూసెంటర్, ఆగస్టు 18 : గిరిజనులకు జనాభా దమాషా ప్రకారం 12 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని సేవాలాల్‌సేన వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు భూక్యా సంజీవనాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని పేరాల కట్టయ్య ఫంక్షన్‌హాల్లో ఆదివారం ఆ సంఘం జిల్లా కన్వీనర్ నందులాల్ అధ్యక్షతన సదస్స నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గిరిజనులకు గత ప్రభుత్వం 10 శాతం రిజర్వేషన్ అమలు చేసిందని, నేటికి అది అమలు కావడంలేదని ఆరోపించారు. పాలకులు గిరిజనులను కేవలం ఓటు బ్యాంకుగానే వాడుకుంటున్నారని, వారి సమస్యలను పరిష్కరించడం లేదని మండిపడ్డారు. జీవో నెంబర్ 3 స్థానంలో మరొక జీవోను తీసుకువచ్చి, వందశాతం ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పది శాతం రిజర్వేషన్లను కాపాడుతూ హామీలను అమలు చేయాలని, సెప్టెంబర్ 9న నిర్వహించే ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సేవాలాల్ సేన ఆధ్వర్యంలో నిర్వహించే గిరిజన సింహగర్జనను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మహబూబాబాద్ జిల్లా సేవాలాల్ సేన జిల్లా నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన నాయకులు దారావత్ మోతీలాల్, దారావత్ వెంకన్న, మాలోతు సురేష్, గణపతి, రాంబాబు, వినోద్, నరేందర్, బాలు, పూజాభాయి, బాలాజీ, సుమన్, స్రవంతి పాల్గొన్నారు.

85 మంది జేఎల్‌ఎంలకు పదోన్నతి

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 18 : జిల్లా వ్యాప్తంగా విద్యుత్‌శాఖలో జూనియర్ లైన్‌మెన్ (జేఎల్‌ఎం)లుగా విధులు నిర్వహిస్తున్న 85 మందికి అసిస్టెంట్ ఏఎల్‌ఎంగా పదోన్నతి కల్పిస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా అధికారి జె.నరేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహబూబాబాద్ డివిజన్ పరిధిలో 53 మంది జేఎల్‌ఎంలు, తొర్రూరు డివిజన్ పరిధిలో 32 మందికి, మొత్తం 85 మంది జేఎల్‌ఎంలకు ఏఎల్‌ఎంలుగా పదోన్నతి లభించినట్లు చెప్పారు.




బయ్యారం బొడ్రాయి వద్ద బోనంతో ప్రదర్శన చేస్తున్న మహిళలు, రంగాపురంలో ముత్యాలమ్మ తల్లికి బోనం సమర్పిస్తున్న మహిళలు

ఘనంగా ముత్యాలమ్మ బోనాలు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఆగస్టు 18 : జిల్లా కేంద్రంలో ఆదివారం శ్రీముత్యాలమ్మకు బోనాలు చెల్లించి, మొక్కులు తీర్చుకున్నారు. కొత్తబజారులోని శ్రీ ముత్యాలమ్మ తల్లి దేవాలయంలో మహబూబాబాద్ శాసన సభ్యుడు భూక్య మురళీనాయక్ సతీమణి ఉమా బోనం సమర్పించి, పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్-సీతామహాలక్ష్మీ దంపతులు అమ్మవారికి బోనాలు చెల్లించుకున్నారు. పాతబజారులోని శిఖార్‌ఖాన్‌గడ్డ, గాయత్రిగుడి సమీపంలోని ముత్యాలమ్మ ఆలయాలతో పాటు వివిధ కాలనీల్లో ఉన్న ఆలయాల వద్దకు మహిళలు చేరుకొని బోనాలు చెల్లించి, మొక్కులు తీర్చుకున్నారు.



డోర్నకల్‌లో బోనాలు వెళ్తున్న మహిళలు

బోనమెత్తిన బయ్యారం..

బయ్యారం : గ్రామం సుభిక్షంగా ఉండాలని.. పాడి పంటలు కురియాలని.. ప్రజలు ఆయురారోగ్యాలతో జీవించేలా దీవించే గ్రామ దేవత ముత్యాలమ్మ తల్లి బయ్యారం, రంగాపురం గ్రామస్థులు బోనం చెల్లించారు. బయ్యారం, రంగాపురం గ్రామ మహిళలు బోనమెత్తుకొని గ్రామంలో ఊరేగింపుగా బయలుదేరి గ్రామ శివారులోని ముత్యాలమ్మ ఆలయం వద్ద ప్రదర్శన చేసి అమ్మవారికి బోనం సమర్పించి, మొక్కులు చెల్లించారు. అనంతరంవాహనాలు, ఎడ్ల బండ్లను ఆలయం చుట్టూ తిప్పారు. భక్తుల సౌకర్యార్థం నిర్వాహకులు ఆలయాల వద్ద తగు ఏర్పాట్లు చేశారు.




కొత్తబజారులోని ముత్యాలమ్మ తల్లికి బోనాలు చెల్లించేందుకు వెళ్తున్న మానుకోట ఎమ్మెల్యే మురళీనాయక్ సతీమణి ఉమా, మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ -సీతామహాలక్ష్మీ దంపతులు

ప్రశాంతంగా పద్మశాలి సంఘం ఎన్నికల ఓటింగ్



కొత్తగూడలో ఓటు వేస్తున్న పద్మశాలీలు

తొర్రూరు, ఆగస్టు 18 : రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన పద్మశాలి సంఘం అధ్యక్ష ఎన్నిక ఓటింగ్ ప్రక్రియ ఆదివారం తొర్రూరులో ప్రశాంతంగా ముగిసింది. డివిజన్ పరిధిలోని పెద్దవంగర, తొర్రూరు, దంతాలపల్లి మండలాల్లోని పద్మశాలీయులు ఓటుహక్కును వినియోగించుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు వేముల వెంకన్న తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఎన్నిక అనంతరం రాష్ట్ర కమిటీ ఎంపికకు ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. పద్మశాలిల ఐక్యతకు అన్నిరకాలుగా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు పెండెం రమేష్, కందగట్ల సోమశేఖర్, పులేందర్, సంతోష్, సంజీవ, ఉమేష్, వివిధ సంఘాల నాయకులు, కమిటి సభ్యులు పాల్గొన్నారు.

- కొత్తగూడ : పద్మశాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నిక పోలింగ్‌ను కొత్తగూడలో పద్మశాలీ సంఘం మం డల అధ్యక్షుడు కుసుమ రాజన్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. కొత్తగూడలోని ద్విచక్రవాహనాల షోరూంలో పోలింగ్ ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా రాజన్‌బాబు మాట్లాడుతూ ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 4వరకు ఓటింగ్ పద్ధతిలో రాష్ట్ర అధ్యక్షుడిని ఎన్నికునేందుకు పోలింగ్ నిర్వహించామన్నారు. కార్యక్రమంలో దేవుళ్లపల్లి రాజు, పూల యాదగిరి, దేవుళ్లపల్లి రాజేశ్వర్, మెరుగు శ్రీనివాస్, జగన్, కుసుమ రజని, మెరుగు శిల్ప పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ రెడిమెడ్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న కల్లు గీత కార్మిక సంఘం నేతలు



మహబూబాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న కల్లుగీత కార్మిక సంఘం నాయకులు

ఘనంగా సర్దార్ పాపన్న జయంతి

● జిల్లాలో ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు నివాళి

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 18 : జిల్లా వ్యాప్తంగా సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలను ఆదివారం నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్‌టొప్పో, ఎం.డేవిడ్ మాట్లాడుతూ ఖిలాషాపురంలో జన్మించిన పాపన్న గౌడ్.. నాటి నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిప్రజల పక్షాన నిలిచిన ధీశాలి అని కొనియడారు. మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, బీసీ వెల్ఫేర్ అధికారి నర్సింహస్వామి, గౌడ సంఘం ప్రతినిధులు యమగాని వెంకన్న, గౌని వెంకన్న, గునిగంటి మోహన్, బెల్లంకొండ శ్రీనివాస్, జెరిపోతుల వెంకన్న, సమ్మయ్యగౌడ్, బూర్ల ప్రభాకర్ గౌడ్, డౌలాగర్ శంకర్ పాల్గొన్నారు.

- మహబూబాబాద్ అంబేద్కర్ విగ్రహం ఎదుట బీఎస్పీ ఆధ్వర్యంలో పాపన్న జయంతిని నిర్వహించారు. బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి దార్ల శివరాజ్, జిల్లా ఇన్‌చార్జిలు ఎల్.విజయ్‌కాంత్, దారా ప్రసాదరావు, నిర్మలమ్మ, అక్కమ్మ, సుశీల, రాజేశ్వరి, శైలజ, మైసయ్య పాల్గొన్నారు.
- బీజేపీ అనుబంధ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. జిల్లా అధ్యక్షుడు పైండ్ల శ్రీనివాస్, పరికిపండ్ల అశోక్, జనార్ధన్, రజనీకాంత్, పులి శ్రీనివాస్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.
- జిల్లా కేంద్రంలో కల్లుగీత కార్మిక సంఘం (కేజీకేఎస్)ఆధ్వర్యంలో పాపన్నగౌడ్ జయంతిని నిర్వహించారు. తొలుత పట్టణంలో కల్లుగీతకార్మికులు బైక్‌ర్యాలీ నిర్వహించారు. కురవిగేట్ వద్ద పాపన్నగౌడ్ రెడీమెడ్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేజీకేఎస్ జిల్లా కార్యదర్శి గౌని వెంకన్న మాట్లాడుతూ కురవిగేట్ ప్రాంతాన్ని పాపన్న సెంటర్‌గా నామకరణం చేయాలని విజ్ఞప్తి చేశారు. మోహన్, ఉప్పలయ్య, వెంకటేశ్వర్లు

మిగతా 6వ పేజీలో..



మహబూబాబాద్‌లో సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలో మాట్లాడుతున్న మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి



తొర్రూరులో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ విగ్రహం వద్ద నివాళ్లర్పిస్తున్న గౌడసంఘం ప్రతినిధులు

చికిత్స పొందుతూ కౌలు రైతు మృతి

వేలేరు మండలం శాలపల్లి యువకుడి ఆత్మహత్య

వేలేరు, ఆగస్టు 18: వ్యవసాయ భూమి కౌలుకు తీసుకుని పంటలను సాగు చేయగా ఆశించిన మేరకు దిగుబడి రాకపోవడంతో పాటు పంట సాగుకు తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలనే మనోవేదనకు గురైన యువ రైతు పురుగుల మందుల తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లగా ఆదివారం తెల్లవారు జామున ఎంజీఎంలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై ఏ సురేష్ తెలిపారు. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

హనుమకొండ జిల్లా వేలేరు మండలం శాలపల్లి గ్రామానికి చెందిన దామెర సమ్మయ్య- కోమల దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. తండ్రి దామెర సమ్మయ్య పది సంవత్సరాల క్రితం మృతి చెందాడు. దీంతో కుటుంబ భారం పెద్ద కుమారుడైన దామెర అనిల్ కుమార్ (31) పై పడింది. తమ్ముడు బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. అలాగే చెల్లెలు వివాహాన్ని ఇటీవలచేశాడు. ఎలాంటి జీవనోపాధి లేకపోవడం, ఎలాంటి ఆస్తులు సైతం లేవు. కేవలం ఇళ్లు మాత్రమే ఉంది. ఆదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వ్యవసాయ భూమి 5 ఎకరాలు కౌలుకు తీసుకున్నాడు. గత మూడు సంవత్సరాలుగా అందులో పత్తి పంటలను సాగు చేస్తున్నాడు. ఇందులో ఆశించిన మేరకు పంట రాకపోవడంతో సుమారుగా రూ. 3 లక్షల వరకు నష్టం వాటిల్లింది. దీనికి తోడు కుటుంబ భారంతో మరో రూ.3.50 లక్షలు, మొత్తం రూ. 6.50 లక్షల వరకు అప్పులైయ్యాయి. దీంతో చేసిన అప్పుల ఎలా తీర్చాలని మనోవేదనకు గురైయ్యాడు. ఈక్రమంలో శనివారం అర్ధరాత్రి ఇంటి వద్ద పురుగుల మందుతాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. పరిస్థితిని గమనించిన బంధువులు ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు, మృతునికి వివాహం కాలేదు. దీంతో మృతుడి తల్లి దామెర కోమల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


దామెర అనిల్‌కుమార్ (ఫైల్)

టీపీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్‌గా రంజిత్



వరంగల్ లీగల్, ఆగస్టు 18: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ లీగల్‌సెల్ రాష్ట్ర కన్వీనర్‌గా హనుమకొండ పట్టణానికి చెందిన న్యాయవాది కూనూరు రంజిత్ నియమితులయ్యారు. టీపీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్ ఈ మేరకు ఆదివారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డికి, మంత్రులు కొండా సురేఖ, సీతక్క, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు కేఆర్. నాగరాజు, నాయిని రాజేందర్‌రెడ్డిలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

మానుకోట జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి సస్పెన్షన్

మహబూబాబాద్ జిల్లా ఇన్‌చార్జ్‌గా రవీంద్రశర్మకు బాధ్యతలు

మహబూబాబాద్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి పసుపులేటి చంద్రశేఖర ప్రసాద్‌ను సస్పెండ్ చేస్తూ శనివారం సాయంత్రం హైకోర్టు ఉత్వర్వులు జారీ చేసింది. మహబూబాబాద్ జిల్లా తొర్రూ రు కోర్టు జడ్జి మట్ట సరిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు సస్పెండ్ చేసినట్లు సమాచారం. ప్రస్తుతం మహబూబాబాద్ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఈనెల 16వ తేదీ నుంచి 21 వరకు సెలవులో ఉన్నారు. ప్రస్తుతం ఆయన హైదరాబాద్‌లో ఉన్నట్లు సమాచారం. ఆయన స్థానంలో జనగామ జిల్లా కోర్టు జడ్జి బి.రవీంద్రశర్మకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ అయినట్లు తెలిసింది.

బల్దియాలో నేడు ప్రజావాణి కార్యక్రమం

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 18: నగర ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకునేందుకు ప్రతీ సోమవారం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం నేడు జరుగనుందని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్టు వెల్లడించారు. ప్రజల సమస్యలు వెల్లడించేందుకు ఉదయం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయానికి వచ్చి ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. సంబంధిత అధికారులు ఫిర్యాదులు పరిష్కరించి తగిన పరిష్కారం చూపిస్తారని కమిషనర్ తెలిపారు.

హరికథా గాన సరస్వతి

- నాలుగు దశాబ్దాలుగా కళారంగంలో తనదైన ముద్ర
- ఒడిదొడుకులను ఎదురైనా కళామతల్లి సేవలోనే..

లక్ష్మీనారాయణ భాగవతార్



మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య, కలెక్టర్ శివలింగయ్య చేతుల మీదుగా సన్మానం అందుకుంటున్న లక్ష్మీనారాయణ



జనగామ కల్చరల్, ఆగస్టు 18: హరికథ తెలుగువారి విశిష్ట ప్రక్రియ. రాగ - తాళ - హావ - భావ ప్రకటనలతో శ్రోతలను, ప్రేక్షకులను ఆకట్టుకోవడంలో దానికదే సాటి. జానపదులకు, పండితులకు అందరికీ ఇష్టమైన కళాప్రక్రియ. వేదికపై ఓ వ్యక్తి నిలబడి తాను గానం చేస్తున్న హరికథలో వచ్చే పాత్రలన్నిటినీ తానే ధరించి నటించి చూపాలి. అందుకే సర్వకళల సమాహారమే ఈ హరికథ గాన ప్రక్రియ. ఈ హరికథను తెలుగు వారి సంస్కృతి చమత్కారంగా భావిస్తారు. కళలకు ఆదరణ తగ్గిపోతున్న సమయంలో భక్తి, జ్ఞాన, వైరాగ్యం కలిగి భగవన్నామస్మరణ చేస్తూ, పట్టు వస్త్రాలు ధరించి, కాళ్లకు గజ్జెలు కట్టి, నొదుట నామాన్ని దిద్దుకొని, చేతిలో చిరుతలు పట్టుకొని, హరినామ స్మరణ చేస్తూ, హరికథ ప్రదర్శనలు ఇస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాడు జనగామ జిల్లాకు చెందిన హరికథకుడు బొడిగె లక్ష్మీనారాయణ భాగవతార్. బొడిగె అంజమ్మ, శివయ్య దంపతులకు 1954 సెప్టెంబరు 25న జన్మించిన ఆయన కాకతీయ విశ్వవిద్యాలయంలో బీఓఎల్ పట్టా పుచ్చుకొని హరికథా గానంతో జీవనాన్ని సాగిస్తున్నారు. ప్రముఖ తెలుగు పండితులు పండితారాధ్యుల రామగిరి నాగయ్య శాస్త్రి, ప్రముఖ సంస్కృత పండితులు, దేవీ ఉపాసకులు మాదవపెద్ది చిన వెంకన్న శాస్త్రి, ప్రముఖ రచయిత నెల్లుట్ల నర్సింహారావు లక్ష్మీనారాయణకు సాహిత్య గురువులు. 40ఏళ్లుగా రాజరాజేశ్వరీదేవి అమ్మవారినే ధ్యానిస్తూ హరికథ కళారంగంలో ఒడిదుడుకులు ఎదురైనా ఆ కళామతల్లికి సేవలోనే ఉన్నారు.

ప్రదర్శనలు.. సత్కారాలు.. అవార్డులు..

లక్ష్మీనారాయణ తన 14వ యేట 7వ తరగతి చదువుతున్న రోజుల్లో తల్లిదండ్రులతో కలిసి భద్రాచల దేవస్థానానికి వెళ్లి ఆ పవిత్రమైన గోదావరి నదీ తీరాన 'శ్రీ సీతారామ కళ్యాణం', 'భద్రాద్రి వైభవం' అనే సంగీత రూపకాన్ని రచించి స్థానిక చెన్న కేశవ స్వామి భజన మండలిలో చేరి అనేక వేదికల ద్వారా గానం చేశారు. 1972లో హైద్రాబాద్ ఆకాశవాణి, యువవాణిలో ఈ రూపకాన్ని గానం చేశారు. 1973లో స్థానిక నాటక కళాసంస్థ శ్రీ నటరాజ కళానికేతన్‌లో గాయకుడిగా చేరి తన గాన కళను అభివృద్ధి చేసుకున్నారు. 1975లో స్వతహాగా శ్రీ నటరాజ సంగీత విభావరి అనే పేరుతో ఒక సంస్థను స్థాపించి ప్రదర్శనలు ఇస్తూ ఔత్సాహిక గాయనీ గాయకులతో కలిసి భక్తి ప్రధానమైన సంకీర్తనలో కూడిన పాటక కచేరీలు చేశారు. ఆలిండియా రేడియో కేంద్రం ద్వారా అనేక ప్రత్యేక సంగీత రూపకాలైన నల్లనివాడు, దివ్య దీపావళి, హోలీ సంబరాలు, ఉగాది వేడుక, సంక్రాంతి సరదాలు, బతుకమ్మ సౌందర్యం మొదలగు రూపకాలు రచించి స్వయంగా సంగీతాన్ని సమకూర్చి ఆలిండియా రేడియో ద్వారా సమర్పించారు. ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక శాఖ ద్వారా మైసూరు, మద్రాసు, మహారాష్ట్ర, బిహార్, ఛత్తీస్‌గఢ్, రాయపూర్, ఉత్తరప్రదేశ్, ఒరిస్సా తదితర రాష్ట్రాల్లో హరికథా గానం చేసి అనేక సత్కారాలు, బిరుదులు అందుకున్నారు.



సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.వెంకటరాంరెడ్డి నుంచి సన్మానం అందుకుంటున్న లక్ష్మీనారాయణ

ఓ వైపు ప్రదర్శనలిస్తూనే మరోవైపు హైద్రాబాద్ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో హరికథ డిప్లొమా కోర్సు పూర్తి చేసి ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. 1995లో మద్రాసు భాగవతా సేవా మండలి వారితో సత్కారం అందుకున్న ఆయన.. ప్రముఖ సినీ నటుడు పొట్టి ప్రసాద్ చేతుల మీదుగా గానకోకిల బిరుదును అందుకున్నారు. కందుకూరి వీరేశలింగం జన్మదినం సందర్భంగా 2011లో నాటి ఏపీ ప్రభుత్వం తరపున కలెక్టర్ రాహుల్ బొజ్జా చేతుల మీదుగా రూ.10వేల నగదు, జ్ఞాపిక అందుకున్నారు. 2013లో నాటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా ఉగాది పురస్కారాన్ని, 2015లో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.వెంకటరాంరెడ్డితో సన్మానం అందుకున్నారు. 2024లో విజయనగరం ఆదిబట్ల నారాయణదాసు సంస్థ ఆధ్వర్యంలో హరికథా భాస్కర అనే బిరుదును, తాడేపల్లిగూడెంలో ప్రముఖ రంగస్థల నటుడు షణ్ముఖ ఆంజనేయ రాజు సంస్థ ఆధ్వర్యంలో 'హరికథా గాన సరస్వతి', సిద్దిపేటలోని ఎస్ఎస్‌సీ ఛానల్ ఆధ్వర్యంలో 'హరికథా కేసరి' బిరుదులను అందుకున్నారు. యువ సంగీత దర్శకులు, కవి చిలుమోజు సాయికిరణ్ రచించిన కవనతీగ కవితా సంపుటి పుస్తకావిష్కరణ సందర్భంగా 'జీవిత సాఫల్య పురస్కారం', 'హరికథా కళాబంధు' బిరుదును పొందారు. తెలంగాణ సమైక్యతా వజ్రోత్సవాలను పురస్కరించుకొని నాటి ఉపముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య, కలెక్టర్ శివలింగయ్య, జడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి చేతుల మీదుగా ఘన సన్మానం పొందారు.

భరత నాట్యమయూరి..

అలకనంద





ప్రశంసా పత్రాలు, అవార్డులతో అలకనంద

మల్హర్, ఆగస్టు 18 : ఆ చిన్నారి వయసు 12యేళ్లు. ఆరో తరగతి చదువుతోంది. తనకు శాస్త్రీయ నృత్యంపై ఉన్న మక్కువతో ఓ గురువు వద్ద నాట్యం నేర్చుకుంటూనే.. సోషల్‌మీడియాలో అందుబాటులో ఉన్న నృత్య సాధన వీడియోలు చూసి మరింత సాధన చేసింది. చిన్నవయసులోనే పలు వేదికలపై ప్రదర్శనలిచ్చి ఔరా అనిపించుకుంటోంది భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలంలోని అన్‌సాన్‌పల్లి గ్రామానికి చెందిన బానోత్ అలకనంద రాథోడ్. శాస్త్రీయ నృత్యంలో రాణిస్తూ అనేక ప్రశంస పత్రాలు, అవార్డులతో పాటు ప్రముఖులు, సాహితీ ప్రియుల ప్రశంసలు అందుకుంటోంది. అలకనంద తండ్రి బానోత్ రాజ్‌కుమార్ మాజీ సైనికుడు, తల్లి దివ్య గృహిణి. ప్రస్తుతం వారు భూపాలపల్లిలో నివాసం ఉంటుండగా.. అలకనంద పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఆరో తరగతి చదువుతోంది. సాహిత్య రంగంలో పట్టున్న తండ్రి రాజ్‌కుమార్.. తన కూతురు అలకనందకు శాస్త్రీయ నృత్యంపై ఉన్న మక్కువను గుర్తించి.. రెండేళ్ల క్రితం పట్టణంలో నాని మాస్టర్ వద్ద చేర్పగా.. ఆయన శిక్షణ, సలహాలతో పాటు తల్లిదండ్రుల ప్రోత్సాహంతో అలకనంద సోషల్ మీడియాలో వివిధ నాట్యాల వీడియోలు చూస్తూ సాధన ప్రారంభించి నాట్యంపై పట్టు పెంచుకుంటోంది. ఈ క్రమంలోనే పలు వేదికలపై నృత్య ప్రదర్శనలు ఇస్తూ సత్తా చాటుతోంది. భూపాలపల్లిలో సింగరేణి ఆవిర్భావ వేడుకల్లో, శ్రీరామ నవమి ఉత్సవాలు, గణపతి నవరాత్రి ఉత్సవాలు, హైదరాబాద్ రవీంద్రభారతి, త్యాగరాయ గానసభల్లో నిర్వహించిన పలు జాతీయ స్థాయి నృత్య పోటీలు, ప్రదర్శనలు, పోలీసుశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బడాఖానా వేడుకలు, తదితర వేదికలపై నృత్య ప్రదర్శనలు చేసింది. వల్లూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి ప్రశంసా ప్రతం, ప్రముఖ సినీ గేయ రచయిత చంద్రబోస్ జన్మదిన వేడుకల్లో ప్రశంస పత్రం, ఉగాది పురస్కార వేడుకల్లో నాట్య కళా ప్రవీణ అవార్డు, విశ్వవిఖ్యాత ఆర్ట్స్, కల్చరల్ అకాడమీ, గౌతమేశ్వర గోసంరక్షణ సమితి ఆధ్వరంలో ఇటీవల గౌతమి నంది అవార్డు అందుకుంది. అలాగే జాతీయస్థాయి ఐకాన్ అవార్డు కూడా సొంతం చేసుకుంది. నాట్యంతో పాటు చదువులోనూ రాణిస్తున్న అలకనంద ఐఏఎస్ కావడమే లక్ష్యంగా తన భవిష్యత్‌కు బాటలు వేసుకుంటోంది.



జాతీయస్థాయి గౌతమి నంది అవార్డును అందుకుంటున్న అలకనంద

సౌకర్యాల లేమిలో గ్రంథాలయాలు

- నిధుల కొరతతో వసతులు కరువు
- తీవ్ర సిబ్బంది కొరత
- ఉన్నవారిపైనే పని భారం
- పదేళ్లుగా జరగని నియామకాలు
- పార్ట్‌టైమ్ ఉద్యోగులతోనే నిర్వహణ

హనుమకొండ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలోని గ్రంథాలయాలు నిధులలేమివల్ల అనేక సమస్యలతో కూనారిల్లుతున్నాయి. గ్రంథాలయాలకు వచ్చే పాఠకులకు కనీసం సౌకర్యాలు కల్పించలేకపోతున్నాయి. ఆరేళ్లుగా గ్రంథాలయాలకు బడ్జెట్ రావడం లేదు. దీంతో కరెంట్ బిల్లులు కట్టలేని దయనీయ స్థితి నెలకొన్నది. బిల్లులు చెల్లించకపోతే కరెంట్ సరఫరా నిలిపి వేస్తామని విద్యుత్ సంస్థ ఇప్పటికే వీటికి రెండు మూడు సార్లు నోటీసులు జారీ చేసింది. గ్రంథాలయాలకు పేపర్ బిల్లులు చెల్లించడానికి కూడా డబ్బులు లేవు. ఆరు నెలలుగా పేపర్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. పేపర్‌బాయ్‌లు బిల్లుల కోసం కాళ్లరిగేలా తిరుగు తున్నారు. బిల్లులు ఎంతకూ చెల్లించకపోవడంతో కొన్ని చోట్ల గ్రంథాలయాలకు పేపర్లు వేయడాన్ని మానుకున్నారు. కాలిపోయిన బల్బులను మార్చాలన్న, విరిగిపోయిన కుర్చీలకు మరమ్మతులు చేయించాలన్నా కూడా డబ్బులు లేక ఉద్యోగులు సతమతమవుతున్నారు.



హనుమకొండ పబ్లిక్ గార్డెన్ సమీపంలోని జిల్లా క్రేంద గ్రంథాలయం

వెల్లువలా ఉద్యోగార్థులు

ప్రభుత్వం ఉద్యోగాల భర్తీ ప్రక్రియను చేపట్టింది. ఈ మేరకు ఉద్యోగ నోటిషికేషన్లు జారీ అవుతున్నాయి. దీంతో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు ఉద్యోగార్థులు పెద్ద సంఖ్యలో గ్రంథాలయాలకు వస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని గ్రంథాలయాలు అభ్యర్థులతో కిటకిటలాడు తున్నాయి. కూర్చోవడానికి కుర్చీలు కూడా సరిపోవడం లేదు. సరిపోయేన్ని కుర్చీలు సమకూర్చడానికి గ్రంథాలయాల వద్ద డబ్బుల్లేవు. దీనితో పాఠకులు ఏదోవిధంగా సర్దుకొని కూర్చొని చదువుకుంటున్నారు. పాఠకులకు కావలసిన స్టడీ మెటీరియల్ కోసం మార్కెట్‌లోకి వచ్చిన కొత్త పుస్తకాలను గ్రంథాలయాలు సమకూర్చలేకపోతున్నాయి. పాత పుస్తకాలతోనే పాఠకులు ఎలాగోలా సర్దుకుపోతున్నారు. కొత్త పుస్తకాల కోసం ఇండెంట్ పెడితే ఎప్పుడో గానీ రావడం లేదు. పాఠకులు డిమాండ్ బుక్‌లో రాసిన ఏ నెల రోజులకో గానీ అందడంలేదు. ఉద్యోగ పరీక్షలకు సిద్ధమవుతున్న పాఠకులు కరెంట్ ఆఫైర్స్ కోసం ఎక్కువగా వివిధ పత్రికలపై ఆధారపడుతుంటారు. ఎన్ని ఎక్కువ పత్రికలు చదివితే అంత తాజా మెటీరియల్ దొరుకుతుంది. కానీ డబ్బులు లేక ఏవో గ్రంథాలయాలు ఏవో కొన్ని పత్రికలను మాత్రమే పాఠకులకు సమకూర్చగలుగుతున్నాయి.

తీవ్ర సిబ్బంది కొరత

గ్రంథాలయాల్లో సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. రెగ్యులర్ ఉద్యోగులు వేళ్లమీద లెక్కపెట్టేంత మంది మాత్రమే ఉన్నారు. లైబ్రరీలన్నీ ఔట్‌సోర్సింగ్, పార్ట్‌టైమ్ ఉద్యోగులతోనే నడుస్తున్నాయి. హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లోని జిల్లా కేంద్ర గ్రంథాలయంతో సహా ఆరు జిల్లా గ్రంథాలయాలు, 50 మండల కేంద్రాల్లో 50 బ్రాంచ్ లైబ్రరీలు ఉన్నాయి. మండలాల పునర్విభజన తర్వాత కొత్తగా ఏర్పడిన మండలాల్లో ఇప్పటి వరకు లైబరీల ఏర్పాటు జరగలేదు. ఈ మండలాలకు చెందిన పాఠకులు పొరుగు మండలాలలోని లైబ్రరీలను ఆశ్రయించాల్సి వస్తోంది. ఉద్యోగ నోటిఫికేషన్ల వల్ల ఈ గ్రంథాలయాలు కూడా నిరుద్యోగ పాఠకులతో కిటకిటలాడుతూ కనిపిస్తున్నాయి. ఈగ్రంథాలయాల్లో 150 మంది రెగ్యులర్ ఉద్యోగులు ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం 21 మంది మాత్రమే ఉన్నారు. ఔట్‌సోర్సింగ్, పార్ట్‌టైమ్ ఉద్యోగులు మరో 50 మంది ఉన్నారు. రిటైర్ అయిన ఉద్యోగుల స్థానంలో కొత్తవారి నియామకాలు జరగటం లేదు. 1993 నుంచి కొత్త రిక్రూట్‌మెంటే లేదు. ప్రతీ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 25 నుంచి 30 మంది రెగ్యులర్ ఉద్యోగులు, 50మందికిపైగా ఔట్‌సోర్సింగ్, లేదా పార్ట్ టైమ్ ఉద్యోగులు ఉండాలి. అలాగే మండల కేంద్రంలోని బ్రాంచ్ లైబ్రరీలో 5గురు రెగ్యులర్ ఉద్యోగులు, 10 మంది ఔట్‌సోర్సింగ్, పార్ట్‌టైమ్ ఉద్యోగులు ఉండాలి. కానీ ఇందుకు భిన్నంగా కేంద్ర గ్రంథాలయాల్లో 10 మందికన్నా తక్కువగా రెగ్యులర్ ఉద్యోగులు, 15 మంది వరకు ఔట్‌సోర్సింగ్, పార్ట్‌టైమ్ ఉద్యోగులు పని చేస్తున్నారు. పలు గ్రంథాలయాల్లో స్వీపర్లు లేరు. కొన్ని లైబ్రరీలను ఊడ్చేపనిని పార్ట్‌టైమ్ ఉద్యోగులే చేస్తున్నారు.

చైర్మన్లు లేరు..

జిల్లా కేంద్ర గ్రంథాలయాలకు చైర్మన్లు లేరు. గత బీఆర్ఎస్ హయాంలో నియమితులైన చైర్మన్లు రాజీనామా పెట్టడంతో ఆ పోస్టులు ఖాళీ అయ్యాయి. హనుమకొండలోని బీఆర్ఎస్ సర్కా రు హయాంలో నియమితులైన జిల్లా కేంద్ర గ్రంథాలయ చైర్మన్ అజీజ్‌ఖాన్ లోక్‌సభ ఎన్నికల ముందు తన పదవికి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. అప్పటి నుంచి ఈ లైబ్రరీకి చైర్మన్ లేడు. ప్రభుత్వం జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించిన తర్వాత పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. ఉద్యోగార్థులంతా లైబ్రరీలకు వెల్లువలా వస్తున్నారు. పెద్ద మొత్తంలో ఫీజు చెల్లించలేని గ్రామీణ నిరుపేద నిరుద్యోగులు స్టడీ మెటీరియల్ కోసం లైబ్రరీలనే ఆశ్రయిస్తున్నారు. ఈ దృష్ట్యా వాటిని పటిష్టం చేయాలని ప్రజలు కోరుతున్నారు. క్రమం తప్పకుండా నెలనెలా వేతనాలు చెల్లించాలని ఉద్యోగులు ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తున్నారు. సిబ్బంది కొరతను తీర్చాలని కోరుతున్నారు.

ఎన్పీడీసీఎల్‌లో పదోన్నతి సంబురం

ఉమ్మడి జిల్లాలో 476 మంది జెఎల్‌ఎంలకు ఏఎల్‌ఎంలుగా పదోన్నతి

హనమకొండ టౌన్, ఆగస్టు 18: జేఎల్ఎంలకు ఏఎల్ఎంలుగా పదోన్నతి కల్పిస్తూ ఎన్పీడీసీఎల్ పరిధిలోని డివిజనల్ అధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసి సిబ్బందికి ఆర్డర్ కాపీలను అందజేశారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్‌పై బీసీ, ఓసీ ఉద్యోగ సంఘాలు మెరిట్ కమ్ సీనియారిటీ ఆధారంగా పదోన్నతులు చేపట్టాలని, మరోవైపు ఎస్సీ, ఎస్టీ అసోయేషన్లు మాత్రం రిజర్వేషన్ కమ్ సీనియారిటీ ప్రకారం పదోన్నతులు చేపట్టాలని కోర్టుకు వెళ్లాయి. కోర్టు తీర్పు పెండింగ్‌లో ఉండటంతో యాజమాన్యం బదిలీలు ముందుగా చేపట్టాలని ఆలోచనకు వచ్చింది. ఈక్రమంలోనే ఉద్యోగ సంఘాలన్నీ ఏకమై జాక్‌గా ఏర్పడి ముందుగా పదోన్నతులపై దృష్టి సారించాలని సీఎండీ వరుణ్‌రెడ్డికి మెమోరాండం అందజేశారు.



ఏడీఈ నుంచి ఏఎల్‌ఎంగా ఆర్డర్ కాపీని అందుకుంటున్న దృశ్యం

కాగా, పదోన్నతులపై కోర్టు వెలువరించే తీర్పు, ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు తదుపరి చర్యలు తీసుకోబడుతాయని షరతులు విధిస్తూ అర్హత ఉన్న ప్రతీ జెఎల్ఎంకు ఏఎల్‌యంగా పదోన్నతి కల్పిస్తూ ప్రస్తుతం ఉన్న దగ్గరే విధులను కొనసాగించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా, ఉద్యోగ సంఘాల చొరవ, కంపెనీ నిర్ణయంతో ఎన్పీడీసీఎల్ పరిధిలోని ఉమ్మడి 5 జిల్లాల్లో 2,361 మంది జెఎల్ఎంలు ఏఎల్‌యంలుగా పదోన్నతి పొందగా, ఉమ్మడి వరంగల్‌లో 476 మంది ఏఎల్ఎంలుగా పదోన్నతి పొందారు. వారిలో హనుమకొండ-119, వరంగల్ -101, జయశంకర్ భూపాలపల్లి, ములుగు- 98, జనగామ- 73, మహబూబాబాద్- 85మంది పదోన్నతి పొందారు.

మల్లన్నకు రూ.10 లక్షల రథం బహుకరణ

ఐనవోలు, ఆగస్టు 18 : ఐనవోలు మల్లికార్జునస్వామికి భక్తుడు రథం బహూకరించాడు. సుమారు రూ.10 లక్షల విలువచేసే రథాన్ని టేకు కర్రతో కళాకృతి ఉట్టిపడే విధంగా తయారు చేయించారు. హనుమకొండ రెడ్డి కాలనీకి చెందిన మల్లన్న భక్తులైన తాటికొండ రమాదేవిమల్లేశం దంపతులు తమ కుమారులైన కీ.శే. రాజు, రంజిత్‌ల జ్ఞాపకార్థం రథాన్ని ఆలయానికి తయారు చేయించి ఇచ్చారు. అందులో భాగంగా ఆదివారం రథంను ఆలయానికి అందజేయగా ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో అర్చకులు రథంను శుద్ధిచేసి గణపతిపూజ, పుణ్యాహ వచనం పూజలు చేసి స్వామి వారి ఉత్సవ విగ్రహాలను రథంలో పెట్టి మాడ వీధులగుండా ప్రదక్షిణలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా దాతలైన మల్లేశం దంపతులకు అర్చకులు స్వామి వారి శేషవస్త్రాలతో ఆశీర్వచనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, ముఖ్య అర్చకులు పాతర్లపాటి శ్రీనివాస్, ఐనవోలు మధుకర్‌శర్మ, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.



దాత బహుకరించిన రథంను ప్రారంభిస్తున్న ఈవో, అర్చకులు

ఆరోగ్యశ్రీ సిబ్బందికి వేతనాలు పెంచాలి

లేకుంటే ఈ నెల 20 తర్వాత సమ్మె

వరంగల్ మెడికల్, ఆగస్టు 18: రాష్ట్రంలో రాజీవ్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ పరిధిలో పనిచేస్తున్న ఆరోగ్యశ్రీ సిబ్బంది వేతనాలు పెంచాలని, ఆరోగ్య మిత్రలకు కూడా ప్రాసెసింగ్ ఆఫీసర్ కేడర్ కల్పించాలని రాజీవ్ ఆరోగ్యశ్రీ ఉద్యోగుల సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు సుమన్, ప్రధాన కార్యదర్శి తిరుపతి, ఉపాధ్యక్షురాలు శిరీష డిమాండ్ చేశారు. తమ డిమాండ్లు నెరవేర్చకుంటే ఈ నెల 20 తర్వాత ఎప్పుడైనా సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. సమస్య పరిష్కారం కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహాలకు ఇప్పటికే పలుమార్లు కలిశామని, అయినప్పటికీ తమ జీతాల పెంపుపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత తక్కువ జీతంతో కుటుంబాల పోషణ భారంగా మారిందని వాపోయారు. 17 ఏళ్ల నుంచి అర్థాకలితో అలమటిస్తున్న తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. జీవో 60 ప్రకారం రూ.22,750 వేతనం తక్షణమే చెల్లించాలని, ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా కాకుండా నేరుగా ట్రస్ట్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో కనీస వేతనాన్ని రూ.35వేలతోపాటు టీఏ, డీఏ సౌకర్యం కల్పించాలని విధి నిర్వహణలో మరణించిన ఉద్యోగికి ప్రభుత్వం నష్టపరిహారం ప్రకటించాలని, హెల్త్‌కార్డు సౌకర్యం కల్పించాలని వారు డిమాండ్ చేశారు.

కవులు కలాలను ఎత్తాలి..

అరసం రాష్ట్ర అధ్యక్షుడు పల్లేరు వీరస్వామి

హనుమకొండ కల్చరల్, ఆగస్టు 18: పాలకుల నియంతృత్వ పోకడలను నిరసిస్తూ కవులు తమ కలాలను ఎత్తాలని అరసం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పల్లేరు వీరస్వామి పిలుపునిచ్చారు. ఆదివారం హనుమకొండ బీఎడ్ కళాశాలలో అభ్యుదయ రచయితల సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా సమావేశం నిధి బ్రహ్మచారి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పల్లేరు వీరస్వామి మాట్లాడుతూ.. బ్రిటీష్ వలసవాద దోపిడీని, దౌర్జన్యాల అణిచివేతకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంతో ప్రభావితమై జాతీయ వాద భావజాల స్ఫూర్తితో కాలాన్ని, గళాన్ని ఎత్తడం కోసం 1936లో ఆవిర్భవించిన సంఘం అభ్యుదయ రచయితల సంఘం అని అన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ వెంకటి, మహ్మద్ సిరాజొద్దీన్‌లు పాల్గొన్నారు. అనంతరం వరంగల్ ఉమ్మడి జిల్లా అరసం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బూర భిక్షపతి, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ మార్క శంకర్‌నారాయణ, సహ అధ్యక్షులుగా చందనాల సుమిత్ర, ఉపాధ్యక్షులుగా ఆనందాచారి, కాసుల రవికుమార్, సోమ నర్సింహచారి, చాగంటి కిషన్, రసూద్, కార్యనిర్వాహక కార్యదర్శిగా గజ్జెల స్వరూపరాణి, సహాయ కార్యదర్శులుగా నరేందర్‌రెడ్డి, రాజు, సోమేశ్వరాచారి, రంగాచారి, లెనిన్, క్రాంతి కుమార్, కోశాధికారిగా రమేష్‌లను ఎన్నుకున్నారు.

డ్రగ్స్ ఫ్రీ సిటీగా చేయడమే లక్ష్యం

వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్‌కిషోర్ ఝా ● పోలీసుల ఆధ్వర్యంలో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా 4కే రన్



బాలసముద్రం, ఆగస్టు 18: వరంగల్ నగరాన్ని డ్రగ్స్‌ఫ్రీ సిటీగా చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా వెల్లడించారు. ఆదివారం పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో 4కే రన్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హనుమకొండ, వరంగల్ కలెక్టర్‌లు పి.ప్రావీణ్య, డాక్టర్ శారద, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డితో పాటు జబర్దస్త్‌ఫేం అదిరే అభి ముఖ్య అతిథులుగా పాల్గొని 4కే రన్‌ను పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. 4కే రన్‌లో పోలీసులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్‌నుంచి అదాలత్ సెంటర్ వరకు, తిరిగి అక్కడి నుంచి పోలీస్ పరేడ్‌గ్రౌండ్ వరకు 4కే రన్ నిర్వహించారు. గెలుపొందిన వారికి ముఖ్య అతిథుల చేతులమీదుగా నగదు పురస్కారాలను అందించారు.

ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. విద్యార్థులు డ్రగ్స్‌ను వ్యతిరేకించాలని, డ్రగ్స్ సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. డ్రగ్స్‌ను నియంత్రించేందుకు పోలీస్ కమిషనరేట్ పరిధిలో ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ.. దేశ భవిష్యత్తు కోసం యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాలను సేవించేవారిని వాటినుంచి దూరం చేసేందుకు అందరు ప్రయత్నించాలని హనుమకొండ కలెక్టర్ పి. ప్రావీణ్య కోరారు. ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ.. మత్తు పదార్థాలకు అలవాటుపడి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు రవీందర్, రాజమహేంద్రనాయక్, అదనపు డీసీపీలు రవి, సంజీవ్, సురేష్‌కుమార్‌తోపాటు ఏసీపీలు దేవేందర్‌రెడ్డి, సీఐలు సత్యనారాయణరెడ్డి, పి.కిషన్, సతీష్‌కుమార్, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది, వివిధ కళాశాల, పాఠశాలల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించని ఏడీలు

ఆర్జేడీ కార్యాలయంలో పర్యవేక్షణ కరువు

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 18 : పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ కార్యాలయంలో ఇద్దరు అసిస్టెంట్ డైరెక్టర్లు (ఏడీలు) కార్యాలయానికి రావడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 19 జిల్లాలకు పర్యవేక్షక కార్యాలయంగా ఉంటున్న ఆర్జేడీ కార్యాలయంలో నిత్యం అందుబాటులో ఉండాల్సిన ఏడీలు.. ఎవరి దారి వారిదే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. కార్యాలయంలో సిబ్బంది జీతభత్యాలకు సంబంధించిన బిల్లులను చేయాల్సిన డీడీవోగా బాధ్యతలు ఉన్న ఏడీ కార్యాలయానికి రావడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇక స్థానికంగా ఉండే మరో ఏడీ ఆయన ఎప్పుడు వస్తారో తెలియదని వివిధ ఉపాధ్యాయ సంఘాలు ఆరోపణలు చేస్తున్నాయి. హైదరాబాద్‌లో ఉండే సదరు అధికారి అక్కడ నుంచే కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు చేస్తున్నారు. ఇక మరో ఏడీ స్థానికంగానే ఉంటూ కార్యాలయానికి రావడం లేదనే విమర్శలున్నాయి. ఇదిలా ఉండగా ఈ మధ్యనే కార్యాలయానికి బదిలీపై వచ్చిన సూపరింటెండెంట్ అదే దారిలో వెళుతున్నట్లు తెలుస్తోంది.



ఏడీ లేక ఖాళీగా ఉన్న కుర్చీ

పర్యవేక్షణ కరువు

ఏడీల విషయం తెలిసినా ఆర్జేడీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై ఉపాధ్యాయ సంఘాల నేతలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. విధుల్లో భాగంగా ఆర్జేడీ వివిధ జిల్లాల్లో పర్యటించిన సందర్భంలోనూ ఏడీల గైర్హాజరుపై దృష్టి సారించలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా విధులకు రాకుండానే వేతనాలు అందుకుంటున్న ఏడీలపై చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాల నేతలు కోరుతున్నారు.

‘వైద్య విద్యార్థిని హత్య చేసిన వారిని శిక్షించాలి’

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 18 : కలకోత్తాలో వైద్య విద్యార్థినీపై అత్యాచారం, హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జిల్లా కార్యదర్శి బి.విజయసారథి డిమాండ్ చేశారు. మానుకోట నెహ్రూసెంటర్‌లో ఆదివారం సీపీఐ, ఎస్ఎఫ్ఐ డబ్ల్యూ ఆధ్వర్యంలోఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్షణమే దోషులను శిక్షించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చట్టాలు కఠినతరం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈఘనటపై పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమత బెనర్జీ సమగ్ర విచారణ జరిపి నేరస్తులను శిక్షించాలన్నారు.

ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి, పెరుగుకుమార్, రేషపల్లి నవీన్, వెలుగు శ్రావణ్, కేదాసు రమేష్, తోట రాజకుమారి, పురం భాగ్యమ్మ, అశోక్, మంద శంకర్, ఎమ్డీ. అలీమా,ఉమా, మల్లికార్జున్, వెంకటేష్, వికాస్, తండా శ్రీనాథ్, మంద శ్రీను, సంతోష్, భద్రు పాల్గొన్నారు.



నెహ్రూసెంటర్‌లో ఆందోళన చేస్తున్న సీపీఐ, ఎస్ఎఫ్ఐడబ్ల్యూ నేతలు



తొర్రూరులో కొవ్వొత్తులతో ర్యాలీని నిర్వహిస్తున్న ఉపాధ్యాయ సంఘాలు

మహిళలపై దాడులను అరికట్టాలి

● మహబూబాబాద్ ఎడ్యుకేషన్ : దేశంలో నిత్యం మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, హత్యలు, దాడులను అరికట్టాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సిద్దోజు కవితఅన్నారు. మహబూబాబాద్‌లోని అంబేద్కర్ విగ్రహం ఎదుట సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూనియర్ డాక్టర్ హత్యకు పాల్పడిన నిందితులను అరెస్టు చేసి చట్టప్రకారం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. శ్రీశైలం, ఫైస శ్రీనివాస్, ఐలయ్య, రమేష్, సువర్ణ, ఉపేందర్, యాకయ్య, శ్రీనివాస్, విద్యాసాగర్, రాజు, నాగముని, సుధాకర్, వీరన్న, మనోహర్, ప్రభాకర్,రఫీ, సోమయ్య పాల్గొన్నారు.

● తొర్రూరు : వైద్య విద్యార్థినిపై హత్యాచార ఘటనను నిరసిస్తూ నిందితులను కఠినంగా శిక్షించాలని ఐక్య ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో తొర్రూరు సాయంత్రం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ ఈ ఘటనకు కారణమైన దుండగులపై విచారణ జరిపి కఠిన శిక్షలు వేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు సూరం ఉపేందర్‌రెడ్డి, విప్లవ్‌రెడ్డి, మురళీకృష్ణ, కొలుపుల శ్రీనివాస్, నాగమల్లయ్య, రఫీ, నబియాబాను, మహిళా ఉపాధ్యాయులు, మహిళా విద్యార్థినులు ఉన్నారు.

● కురవి : కలకత్తా ప్రభుత్వ ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న ట్రైనీ డాక్టర్‌పై అత్యాచారంకు పాల్పడి హత్య చేసిన నిందితులను శిక్షించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు గంధసిరి జ్యోతిబసు డిమాండ్ చేశారు. ట్రైనీ డాక్టర్ హత్యను నిరసిస్తూ కురవి గుడి సెంటర్‌లో ఆదివారం ధర్నా నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు కొలిపాక వీరేందర్, నిమ్మశెట్టి మురళి, అనిల్,పూజేష్, మహిపాల్ పాల్గొన్నారు.




ఈవో భిక్షమాచారి ముందు నగదు, మాట్లాడుతున్న ఏసీబీ డీఎస్పీ సాంబయ్య

భక్తుల వలె వచ్చి.. వలవిసిరి..

● ఈవోను పకడ్బందీగా పట్టుకున్న ఏసీబీ అధికారులు

కొత్తగూడ, ఆగస్టు 18 : గుంజేడు శ్రీముసలమ్మ జాతర ఈవో బిక్షమాచారిని అవినీతి నిరోధక శాఖ అధికారులు పక్కా ప్రణాళికతో పట్టుకున్నారు. సాధారణంగా గుంజేడు జాతరకు ప్రతీరోజు భక్తులు వస్తుంటారు. ఆదివారం ఏసీబీ అధికారులు భక్తులవలెగుడికి వచ్చారు. దేవాలయం సమీపంలో మాటువేశారు. గుడికి సుమారు అరకిలో మీటరు దూరం వద్ద కొందరు అధికారులు బాధితుడు సాంబయ్య సెల్‌ఫోన్‌లో కెమెరా ఆన్‌చేసి జేబులోపెట్టి ఆలయానికి పంపించారు. నడుచుకుంటూ వచ్చిని సాంబయ్య ఈవో భిక్షమాచారిని గుడి బయటకు పిలిచిఎంత కావాలని బేరమాడారు. రూ.10వేల నుంచి మొదలై రూ.20 వేలతో ముగియడంతో సాంబయ్య ఈవో భిక్షమాచారికి డబ్బులు ఇచ్చాడు. మరుక్షణం ఏసీబీ అధికారులు రంగప్రవేశం చేయడంతో ఆలయ ప్రాగణంలో అలజడి మొదలైంది అసలు ఏం జరుగుతుందో తెలియక పూజారులు, ఆలయ సిబ్బంది, భక్తులు అయోమయానికి గురయ్యారు.

ఉలిక్కిపడ్డ ఏజెన్సీ

కొత్తగూడ మండలంలో మొదటిసారి ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించడంతో మండలం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. అసలు ఏం జరిగింది? అని భక్తులు ఆరా తీయడం కనిపించింది. విషయం తెలుసుకునేందుకు ఆసక్తి కనబరిచారు.

నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 18 : పట్టణంలో నిర్మాణమవుతున్న మునిసిపల్ భవన పనులను త్వరగా పూర్తి చేయాలని ఛైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి అన్నారు. అనంతారం రోడ్‌లో నిర్మితమవుతున్న మునిసిపల్ నూతన భవన నిర్మాణ పనులను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ రాంమోహన్‌రెడ్డి మాట్లాడుతూ భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, డీఈ ఉపేందర్ పాల్గొన్నారు.

మురళి ఆశయ సాధనకు కృషి చేయాలి

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 18 : సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ అజ్ఞాత దళ కమాండర్, ఉమ్మడి కొత్తగూడ మండల కార్యదర్శిగా పనిచేసిన సర్ప శ్రీను అలియాస్ మురళి ఆశయ సాధన కోసం కృషి చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి పాయం చిన్నచంద్రన్న అన్నారు. మహబూబాబాద్ ఆ పార్టీ కార్యాలయంలో మురళి చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఫైండ్ల యాకయ్య, బండపల్లి వెంకటేశ్వర్లు, రాజు, యాకయ్య, వీరన్న, మహేష్ పాల్గొన్నారు.

సేవాలాల్ సేన మండల అధ్యక్షుడిగా సురేష్

చిన్నగూడూరు, ఆగస్టు 18 : సేవాలాల్ సేన చిన్నగూడూరు మండల అధ్యక్షుడిగా మేగ్యా తండకు చెందిన బాదావత్‌సురేష్ నియమితులయ్యారు. ఈ మేరకు సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్యా సంజీవ్ నాయక్ ఆదివారం నిర్వహించిన జిల్లా సదస్సులో ఆయనకు నియామక పత్రం అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 18 : రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన మహబూబాబాద్ శివారు జమాండ్లపల్లిలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. రెడ్యాల గ్రామానికి చెందిన గోల్కోండ వీరన్న, నేతి రాజులు శనివారం రాత్రి మహబూబాబాద్ నుంచి రెడ్యాల గ్రామానికి ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. ఈ క్రమంలో జమాండ్లపల్లి వద్దకు రాగానే రోడ్డుపై మృతి చెంది ఉన్న గేదేను ఢీకొట్టడంతో ఇరువురు కిందపడ్డారు. ఈఘటనలో ఇరువురికి తీవ్రగాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నం శ్రీకాంత్ రెడ్డి, రాజవర్ధన్‌రెడ్డి, ఇనుగుర్తి సుధాకర్‌లు ఆస్పత్రికి వెళ్లి ఇరువురిని పరామర్శించి ధైర్యం చెప్పారు.

తొర్రూరు మండలంలో ఏఈవోలు బదిలీ

తొర్రూరు రూరల్, ఆగస్టు 18 : మండలంలోని ఆరు క్లస్టర్ల పరిధి వ్యవసాయ శాఖలో ఏఈవోలుగా విధులు నిర్వహిస్తున్న నలుగురు ఏఈవోలను బదిలీ చేస్తూ శనివారం రాత్రి వ్యవసాయశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు మాటేడు క్లస్టర్ పరిధిలో పని చేస్తున్న ఎం.భరత్‌చంద్ర అమ్మాపురం క్లస్టర్‌కు, వెల్లికట్టె క్లస్టర్ ఏఈవో రవితేజ హన్మకొండ వెళ్లగా, వినయ్‌వర్మ, అమ్మాపురం క్లస్టర్ ఏఈవో దీపిక మాటేడుకు, హరిపిరాల క్లస్టర్ ఏఈవో అరవింద్ బయ్యారం మండలానికి, హరిపిరాలకు పెద్దవంగర మండలం చిట్యాల క్లస్టర్ ఏఈవో వి.మానస, తొర్రూరు క్లస్టర్ ఏఈవో జమున బదిలీ చేశారు. కాగా, ఇటీవల జీలుగక విత్తనాల అవకతవకలపై సస్పెన్షన్‌కు గురైన ఏఈవోలకే బదిలీలో అవకాశం కల్పించారు.

రేపు లయన్స్‌క్లబ్ మెగారక్తదాన శిబిరం

కేసముద్రం, ఆగస్టు 18 : కేసముద్రం లయన్స్‌క్లబ్, రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక హరిహరగార్డెన్స్‌లో ఈనెల 20న మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మామిడి అశోక్, రావుల నవీన్‌రెడ్డి ఆదివారం తెలిపారు. క్లబ్ సభ్యుడు మదిపెద్ది వెంకటేష్ పుట్టినరోజు సందర్భంగా నిర్వహించే ఈ రక్తదాన శిబిరానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ హాజరవుతున్నారని తెలి పారు. యువకులు అధిక సంఖ్యలో పాల్గొని తమ రక్తాన్ని దానం చేసి మరొకరికి ప్రాణదానం చేయాలని కోరారు.

ఘనంగా సర్దార్ పాపన్న జయంతి

(3వ పేజీ తరువాయి)

వీరస్వామి, సత్యనారాయణ, రామన్న, రాములు, లింగయ్య, అంజయ్య, వెంకన్న, విక్రమ్, శ్రీనివాస్, యాకన్న పాల్గొన్నారు.

వివిధ మండలాల్లో..

● నర్సింహులపేట మండల కేంద్రంలో గీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో గాడిపెల్లి రవి, పటేల్ రామన్న, మోహన్, సతీష్ పాల్గొన్నారు. పెద్దనాగారంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో చలమల్ల వీరన్న, విక్రమ్, రామకృష్ణ, రఫీ పాల్గొన్నారు.

● కేసముద్రం మండలంలోని అమినాపురం కేజీఎస్ఎస్ ఫంక్షన్ హాల్‌లో కౌండిన్య గౌడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పాపన్న జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఆయా కార్యక్రమాల్లో సంఘం అధ్యక్షుడు చిర్ర యాకాంతంగౌడ్, ప్రధాన కార్యదర్శి చీకటి వెంకట్రాం నరయ్య, చింతనూరి వెంకన్న, బండారు దయాకర్, తండ వెంకన్న, బొగ్గుల నాగయ్య, కన్న యాకయ్య, చీకటి వేలాద్రి, మోడెం రవీందర్‌గౌడ్, చిలువేరు సమ్మయ్యగౌడ్, గుణగంటి అశోక్, అంబాల భాస్కర్ పాల్గొన్నారు.

● గార్ల మండల కేంద్రంలో గౌడ సంఘం నాయకులు కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కందూనూరి శ్రీనివాస్, తోడేటి శ్రీనివాస్, రాము, కట్టె సత్యం, రమేష్, వెంకట్రాజ్యం పాల్గొన్నారు.

●నెల్లికుదురు మండల కేంద్రంలో పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గడ్డం యాలాద్రి, ఉపేందర్, రాంచంద్రయ్య, గాడిపెల్లి వెంకటేశ్వర్లు, యాకయ్య, సత్యనారాయణ, జిలకర యాలాద్రి, బాబుగౌడ్, తిలక్‌బాబు పాల్గొన్నారు.

● సీరోలు మండలం కొత్తూరు (సి) గౌడ సంఘం ఆధ్వర్యంలో పాపన్నగౌడ్ జయంతిని నిర్వహించారు. గిరిజన సామాజిక చైతన్య వేదిక వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు గుగులోతు కిషన్‌నాయక్, మాజీ సర్పంచ్ యానాల గంగాధర్‌రెడ్డి, మలిశెట్టి వేణు, కృష్ణారెడ్డి, వీరన్న, గౌడ సంఘం నాయకులు బొమ్మగాని మల్సూర్, కొంపెల్లి రాములు, తండ సీతారాములు, మల్లయ్య, బాబుగౌడ్, నరేష్, వెంకటేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

● తొర్రూరులో పాపన్నగౌడ్ విగ్రహానికి కౌండిన్య సంఘం, గౌడ సంఘం, సర్దార్ సర్వాయి పాపన్న సంఘం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కుర్ర శ్రీనివాస్, చామకూరి ఐలయ్య, రాయిపెల్లి యాకయ్య, దూలం శ్రీనివాస్, మునిసిపల్‌చైర్మన్ రాంచంద్రయ్య, వైస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, వివిధ గౌడ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

● కురవి మండలం తట్టుపల్లిలో మోకుదెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి బుడిగే భద్రసేనగౌడ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ముంజాల రాజేందర్‌గౌడ్, గీత పనివారల సంఘం జిల్లా నాయకులు దొంతు రాంమ్మూర్తి, నక్క ఉప్పలయ్య, కత్తి వెంకన్న, గాలి చిన్నసైదులు, గౌని వెంకన్న, ఉప్పలయ్య, వెంపటి సురేష్, నర్సింగం లాలయ్య, అంతటి జాని, గుండగాని సురేష్, శ్రీనివాస్‌గౌడ్, సమ్మయ్యగౌడ్, వీరభద్రంగౌడ్ పాల్గొన్నారు.

● పెద్దవంగరలోని అంబేద్కర్ చౌరస్తాలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లర్పించారు. జైగౌడ సేన యువజన అధ్యక్షుడు దీకొండ శ్యామ్, గౌడ సంఘం అధ్యక్షుడు బొమ్మరి వెంకన్న, అనపురం వినోద్, కృపాకర్, సతీష్, వెంకటనారాయణ, రంగు మురళి, బి.హరికృష్ణ, సైదులు, సతీష్ పాల్గొన్నారు.

నేటి నుంచి పతంజలి ప్రాణ యోగాలో అగ్నిహోత్రం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఆగస్టు 18 : జిల్లా కేంద్రంలోని పతంజలి ప్రాణయోగా ఆరోగ్యసేవా కేంద్రంలో అగ్నిహోత్రం పూజా కార్యాక్రమాలు ఉంటాయని జిల్లా ఆర్యసమాజ్ అధ్యక్షుడు నారాయణ ప్రకాష్‌లోయా ఆదివారం తెలిపారు. జిల్లా కేంద్రంలోని సాయిబాబా దేవాలయం ప్రక్కనగల ఆరోగ్య సేవా కేంద్రంలో రాఖీ పర్వదినాన్ని పురస్కరించుకొని ఈనెల 19 నుంచి 22 వరకు లోకా కల్యాణార్థం వేదమంత్రోచ్చరణల నడుమ దేవపూజ, అగ్నిహోత్రం పూజా కార్యక్రమాలు ఉంటాయని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

కుక్కల దాడిలో 12 గొర్రెలు మృతి

బయ్యారం, ఆగస్టు 18 : గొర్రెల మందపై కుక్కలు దాడి చేయడంతో 12 గొర్రెలు మృతి చెందగా, మరో 10 గొర్రెల పరిస్థితి విషమంగా మారిన ఘటన బయ్యారం మండలం గౌరారం పంచాయతీ వినోభానగర్ గ్రామంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం. వినోభానగర్ గ్రామానికి చెందిన కొమ్మనబోయిన సదానందానికి సుమారు 50 శాలీలు గొర్రెలున్నాయి. రోజువారి మాదిరిగానే శనివారం కూడా మేతకు వెళ్లి వచ్చినంక గొర్రెలను ఇంటి ఆవరణలోని దొడ్డిలో ఉంచారు. ఆదివారం ఉదయం గొర్రెల దొడ్డి శుభ్రభం చేద్దామని చూసే సరికి పలు గొర్రెలు చనిపోవడంతో కంగుతిన్నారు. గొర్రెల మందపై కుక్కలు దాడి చేయడంతో 12 గొర్రెలు మృతి చెందాయి. దీంతో పాటు మరో 10 గొర్రెల పరిస్థితి విషమంగా ఉంది. ఈ ప్రమాదంలో దాదాపు రూ. 2 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు సమాచారం. కాగా, మనుషులు, పశువులపై దాడులు చేసి గయపరిచి ప్రాణాలు తీస్తున్న కుక్కలను చంపాలంటూ తీర్మానం చేసి నివేధికను గ్రామస్థులు పంచాయతీ అధికారులు విన్నవించారు.

ఘనంగా ఝాన్సీరెడ్డి జన్మదిన వేడుకలు



ఝాన్సీరెడ్డి జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

తొర్రూరు, ఆగస్టు 18 : పేదల పక్షపాతి ఝాన్సీరెడ్డి అని పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ అధ్యక్షుడు హనుమాండ్ల తిరుపతిరెడ్డి అన్నారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి జన్మదినం సందర్భంగా తొర్రూరులో పలు సెంటర్లలో కేక్ కటింగ్, ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అన్నదానం, రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేశారు. కొన్ని వార్డుల్లో మహిళలకు చీరల పంపిణీ, ఎస్సీ కాలనీలో అనాథలకు బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. సీనియర్ నాయకులు నిరంజన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్, హమ్యానాయక్, పెదగాని సోమయ్య, సుంచు సంతోష్, సోమ రాజశేఖర్, తూనం శ్రావణ్, నరేందర్‌రెడ్డి, కిషోర్‌రెడ్డి, బాపురెడ్డి, మేకల కుమార్, రాంచంద్రయ్య, సురేందర్‌రెడ్డి, దొంగరి రేవతీశంకర్, బిజ్జాల అనిల్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● పెద్దవంగర : హనుమాండ్ల ఝాన్సీరెడ్డి జన్మదినం సందర్భంగా మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు హనుమాండ్ల తిరుపతిరెడ్డి, కేతిరెడ్డి నిరంజన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్ అధ్వర్యంలో భారీకేక్ కట్‌చేసి మహా అన్నదాన కార్య క్రమం నిర్వహించారు. మంలో మండల ఇన్‌చార్జి విజయ్‌పాల్‌రెడ్డి కాంగ్రెస్ నాయకులు రంగు మురళీగౌడ్, ముత్యాల పూర్ణచందర్, సీతారామ్‌నాయక్, దుంపల శ్యామ్, గోపాల్, శ్రీనివాస్, దేవేంద్ర, సైదులు, యూత్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కేసముద్రంలో సమావేశమైన పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కేసముద్రం, ఆగస్టు 18 : కేసముద్రం స్టేషన్ గీతాంజలి హైస్కూల్లో 2003-04 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 20 ఏళ్ల అనంతరం కలుసుకున్న స్నేహితులు తమ పాతజ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులు గనె యాదగిరి, స్వామి, కె.సాయిలు, బాలరాజు, భూమాటి నవీన్, సీహెచ్.శ్రీనివాస్, బండారు నిర్మల, ఎల్.సంతోష్, బొమ్మనబోయిన రవీందర్‌రెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వెలిశాల సవీన్, తాళ్లపల్లి రాజు, ఇస్సంపల్లి ఉదయ్, సామల సృజన్, రాజశేఖర్, స్రవంతి, ప్రశాంతి, లలిత, బి.సుధీర్, రాధాకృష్ణ, బి.విజయ్, నరేష్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

డోర్నకల్, ఆగస్టు 18 : మునిసిపల్ కేంద్రంలో సీఎంఆర్ఎఫ్ పథకం కింద మంజూరు అయిన చెక్కులను ఆదివారం మునిసిపల్ ఛైర్మన్ వాంకుడోతు వీరన్న లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా వీరన్న మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదల సంక్షేమ కోసం పాటుపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు కాల సుమీర్‌చంద్‌జైన్, మాద శ్రీనివాస్, ఖాదర్‌బాబా, సమ్మయ్య, దరావత్ కృష్ణ, మహేష్, ఫరీద్, హరికృష్ణ, ప్రవీన్‌బాబు, నలబోలు శ్రీనివాస్, తారాచంద్ పాల్గొన్నారు.

‘గిరిజన సంప్రదాయాలను కాపాడుకోవాలి’

కురవి, ఆగస్టు 18 : ప్రాచీన గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలని సేవాలాల్ సేన జాతీయ అధ్యక్షుడు భూక్య సంజీవనాయక్, బీఆర్ఎస్ నాయకుడు ఎనుగుల రాకేష్‌రెడ్డి అన్నారు. కురవిలో గోర్ బంజారల తీజ్ ముగింపు ఉత్సవాల్లో వారు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. బంజరాల ఆరాధ్య పండుగ తీజ్‌ను ప్రభుత్వం గుర్తించి సెలవు దినాలు ప్రకటించాలన్నారు. అనంతరం కురవిలో భారీ ర్యాలీ నిర్వహించి తీజ్ బతుకమ్మలను చెరువులో నిమజ్జనం చేశారు. ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గుగులోతు భీమానాయక్, గుగులోతు రవినాయక్, దేవేందర్‌నాయక్, మంగీలాల్‌నాయక్, శివవర్మనాయక్, గుగులోతు ప్రవీన్‌నాయక్, విష్ణునాయక్, హరినాయక్, తరుణ్, కల్యాణ్, సంగెం భరత్, రాజేష్, రాందాస్, నగేష్ పాల్గొన్నారు.

కస్తూర్బాలో కలుషిత నీరే దిక్కు..

● వసతి గృహం ముందు తల్లిదండ్రుల ఆందోళన

చిన్నగూడూరు, ఆగస్టు 18 : మండలంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో కలుషిత నీరే దిక్కయిందని, శుద్ధ జలాలు అందక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆదివారం పాఠశాల ముందు తల్లిదండ్రులు, స్థానికులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు సురక్షిత నీరు కరువైందని అన్నారు. పాఠశాలలో తాగునీటి వసతి కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని, తక్షణమే ఉన్నత అధికారులు స్పందించి వసతి గృహంలో సమస్యలకు నివారణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు, స్థానికులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

● కొత్తగూడ ఎస్సై కుశకుమార్

కొత్తగూడ, ఆగస్టు 18 : గుర్తుతెలియని వ్యక్తులు పంపిన మెసేజ్‌లు, లింకులు ఓపెన్ చేయవద్దని, సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగ ఉండాలని ఎస్సై కుశకుమార్ సూచించారు. కొత్తగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో నలుగురు వ్యక్తుల నుంచి చోరికి గురైన రూ.60వేల విలువైన సెల్‌ఫోన్‌లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించారు. స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్‌లను బాధితులకు ఎస్సై కుశకుమార్ ఆదివారం అప్పగించారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ సెల్‌ఫోన్‌లు పోయిన, చోరికి గురైన పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదు చేయాలని సూచించారు. సెల్‌ఫోన్ దొరికిన పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాలన్నారు. సెల్‌ఫోన్‌కు వచ్చే ఓటీపీలు ఎవరు అడిగిన చెప్పవద్దన్నారు. సైబర్ నేరానికి గురైతే 1930నెంబరుకు ఫోన్‌చేసి వివరాలు చెప్పాలన్నారు.

30 క్వింటాళ్ల నల్లబెల్లం పట్టివేత

మరిపెడ, ఆగస్టు 18 : 30 క్వింటాళ్ల నల్లబెల్లం, అశోక్‌లేలాండ్ ట్రాలీని పట్టుకొని ఆదివారం రాత్రి మరిపెడ పోలీసులు సీజ్ చేశారు. మరిపెడ ఎస్సై బోలగాని సతీశ్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం... తానంచర్ల శివార్లో నల్లబెల్లం డంపువుతుందన్న సమాచారం మేరకు రాత్రి పోలీస్ సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టగా, 30క్వింటాల బెల్లం ట్రాలీ వాహనంలో తరలిస్తూ పట్టుపడిందన్నారు. అందుకు కారకుడైన వ్యక్తిని ఆదుపులోకి తీసుకొని, బెల్లం, ట్రాలీ వాహనం సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

21న భారత్‌బంద్‌ను సక్సెస్ చేయండి

● మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్



సమావేశంలో మాట్లాడుతున్న పిల్లి సుధాకర్

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 18 : ఎస్సీ వర్గీకరణ చేసుకునే వెసులుబాటును రాష్ట్రాలకు కల్పించడాన్ని నిరసిస్తూ దళిత సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 21న జరుపతలపెట్టిన భారత్‌బంద్‌ను జయప్రదం చేయాలని మాలమహానాడు, ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర కో కన్వీనర్ పిల్లి సుధాకర్ పిలుపునిచ్చారు. మహబూబాబాద్ నలందడిగ్రీ కళాశాల ఆవరణలో ఆదివారం మాలమహానాడు జిల్లా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ ఆగస్టు 21న జరిగే బంద్‌కు వ్యాపార, వాణిజ్యరంగాలు, విద్యాసంస్థలు, ఆర్టీసీ యాజమాన్యలు సహకరించాలని కోరారు. రాజ్యాంగసవరణ జరగకుండా ఎస్సీ వర్గీకరణ ఎలాసాధ్యమవుతుందని ప్రశ్నించారు. దళితులను రాజ్యాధికారం నుంచి దూరం చేయడానికి పాలకులు చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా శాంతియుత పద్ధతుల్లో బంద్ నిర్వహించాలని అందుకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జాతీయ కార్యదర్శి అశోదభాస్కర్, బెజ్జం ఐలేష్, చిట్టిమళ్ల మహేష్, కందూకూరి వెంకటాద్రి, బెజ్జం రమేష్, నాయిని భరత్, ప్రేమ్‌కుమార్, దారాసాత్విక్, యాకాంతం, గాజుల ఉప్పలయ్య, రాములు,మద్దెల రమేష్, మోషయ్య, ఐలయ్య, కృష్ణ పాల్గొన్నారు.

ట్రాక్టర్స్ఓనర్స్ అండ్ డ్రైవర్స్ యూనియన్ పట్టణ కమిటీ ఎన్నిక



మిరియాల మల్లికార్జున్, గండికోట నరసింహ

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 18 : ఏఐటీయూసీ అనుబంధ ట్రాక్టర్ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ పట్టణ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహబూబాబాద్ పట్టణంలో ఆదివారం ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బి.అజయ్‌సారథిరెడ్డి, కార్యదర్శి రేషపల్లి నవీన్ సమక్షంలో యూనియన్ సభ్యులు సమావేశమై నూతన కమిటీని ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా మిరియాల మల్లికార్జున్, కార్యదర్శిగా గండికోట నరసింహ, ఉపాధ్యక్షుడిగా శివ, సహాయ కార్యదర్శులుగా కె.కృష్ణ, సుధాకర్, కోశాధికారిగా సతీష్ ఎన్నికయ్యారు. తమ ఎన్నికకు సహకరించిన సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి, మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డిలకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

వయనాడ్ బాధితుల కోసం విరాళాలు

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 18: కేరళ రాష్ట్రం వయనాడ్ బాధితుల కోసం జిల్లాలోని నెల్లికుదురు మండలంలో సీపీఐ ఆధ్వర్యంలో రూ.4వేల విరాళాలు సేకరించారు. సదరు పైకాన్ని మహబూబాబాద్‌లో సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారధికి ఆదివారం అందజేశారు. వీటిని సీపీఐ రాష్ట్ర సమితి ద్వారా కేరళ రాష్ట్రప్రభుత్వానికి పంపించనున్నట్లు తెలిపారు. వయనాడ్ బాధితులకు సహాయం చేసేందుకు ప్రతీ ఒక్కరు ముందుకు రావాలని కోరారు. సీపీఐ నెల్లికుదురు మండల కార్యదర్శి భైస స్వామి, సహాయ కార్యదర్శి చిర్ర సత్యనారాయణ పాల్గొన్నారు.

జీవో 28 ప్రతులను దహనం చేయాలి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఆగస్టు 18 : ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెనుశాపంగా మారిన జీవో నెంబర్ 28 ప్రతులను ఈనెల 23వ తేదీన దహనం చేసి. నిరసన తెలపాలని సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి అవునూరి రవి పిలుపునిచ్చారు. మహబూబాబాద్ కంకరబోడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2014 ఆగస్టు, 23న ఉద్యోగ, ఉపాధ్యాయులు సీపీఎస్ విధానంలోనే కొనసాగుతామని టీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకువచ్చిన చీకటి జీవో.28ను అన్ని మండలకేంద్రాల్లో దహనం చేసి నిరసన తెలపాలని కోరారు. నాయకులు శ్రీకాంత్‌నాయక్, నాగముని, రఫిక్, వీరన్న, అశోక్ పాల్గొన్నారు.

హైదరాబాద్‌ను విజయవంతం చేయండి

కొత్తగూడ, ఆగస్టు18 : ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 22న చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని సక్సెస్ చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ కొత్తగూడ, గంంగారం సంయుక్త మండలాల సహయ కార్యదర్శి ల్యాదెళ్ల రాజు పిలుపునిచ్చారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వంద రోజుల్లో నాలుగు వందల ఇరవై సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి ఇప్పుడు కొన్నిటిని మాత్రమే అడపదడపా అమలు చేస్తున్నారని విమర్శించారు.

పిచ్చికుక్క దాడిలో పలువురికి గాయాలు

వెంకటాపురం (నూగూరు), ఆగస్టు18 : నూగూరు గ్రామం లో పిచ్చికుక్క ఏడుగురిని దాడిచేసిన సంఘటన ఆదివారం జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం. ఉదయం పిచ్చికుక్క వీధుల వెంట తిరుగుతూ ఇళ్ల బయట ఉన్న ఇండ్ల ముత్యాలు, ఇండ్ల వెంకటేష్, మూకల మాణిక్యం, ఇండ్ల లక్ష్మయ్య, పెద్ది లక్ష్మయ్య, మేకల శిరీష, మధుప్రియను గాయపరిచింది. దీంతో వారిని స్థానికులు వెంకటాపురం ప్రభుత్వ వైద్య శాలకు తరలించారు. తీవ్ర గాయాలైన పెద్ది లక్ష్మయ్య, ఇండ్ల వెంకటేశ్‌ను మెరుగైన వైద్యం కోసం ఏటూరునాగారం ఏరియా వైద్యశాలకు తరలించారు.